క్లుప్తంగా

నేడు పరదేశమ్మ తొలేళ్ల పండగ



పరదేశమ్మ అమ్మవారు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో కొలువుదీరిన పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. సోమవారం అమ్మవారి తొలేళ్ల పండగ నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి ప్రధాన పండగ జరగనుందన్నారు. సాయంత్ర 6 గంటల నుంచి కణితి గ్రామంలోని మీసేవ గ్రౌండ్స్‌లో భారీ బాణసంచా నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

పెదగంట్యాడ: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని అగ్నిమాపక దళ ఇన్‌చార్జి అధికారి పి.నాగేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక దళ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సమతా నగర్ జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే అవి వ్యాపించకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో తిప్పల అరుణ మృతి



తిప్పల అరుణ (ఫైల్)

పెదగంట్యాడ: గాజువాక వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు తిప్పల చినఅప్పారావు సతీమణి, కార్మిక నాయకుడు పులి భూలోకరెడ్డి కుమార్తె తిప్పల అరుణ (63) గుండెపోటుతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆమె అంత్యక్రియలను సోమవారం వెంకన్నపాలెం గ్రామంలో నిర్వహించనున్నారు.

రెండు బోర్లు ప్రారంభం



49వ వార్డులో బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మల్కాపురం: జీవీఎంసీ 49వ వార్డులో రెండు తాగునీటి బోర్లను ఆదివారం ముఖ్య అతిథి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ప్రారంభించారు. బర్మా క్యాంప్ డీ-బ్లాక్, కామాక్షినగర్ ప్రాంతాల్లో రూ.1.80 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. వేసవిలో బోర్లు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు రొంగలి చంద్రమౌళి, బొట్ట శంకర్, కె.మున్నా, కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గోపాలపట్నం: బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిలో తోటపోలమాంబ సేవా సంఘం, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు నీళ్ల ఈశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. దీనికి కాలనీవాసులంతా సహకరించారని కొనియాడారు. పలువురికి మజ్జిగా, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మునపర్తి నాగేశ్వరరావు, నీళ్ల అప్పారావు, కడితి సాధూరావు, గొడ్డు నాగరాజు పాల్గొన్నారు.

పార్కింగ్‌కు అడ్డాగా బస్‌బేలు

- అగనంపూడి, ఇ.మర్రిపాలెం బస్టాప్‌ల వద్ద లారీల నిలిపివేతతో అవస్థలు
- ట్రాఫిక్ సమస్యతో స్థానికుల ఇక్కట్లు



హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని బస్‌బేలో బారులుతీరిన లారీలు

అగనంపూడి: జాతీయ రహదారిపై బస్టాప్‌లకు కొద్దిపాటి దూరంలో ఏర్పాటు చేసిన బస్‌బేలు నేడు భారీ వాహనాల పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోతున్నాయి. అగనంపూడి సాయిబాబా గుడి, ఫ్లైఓవర్ వంతెనకు సమీపంలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి ఎదురుగా బస్టాప్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన బస్‌బేలు నేడు భారీ వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, మరమ్మతుల గ్యారేజీలుగా మారిపోయాయి. సమీపంలో ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండడంతో వాహనాలు రెండు మూడు వరుసల్లో జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్నారు. బస్‌బేలు ఉన్న చోట జాతీయ రహదారి కొద్దిగా కుదించుకుపోయింది. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఓవర్‌టేక్ చేయబోతూ బస్‌బేల వద్ద ఉన్న డివైడర్లను ఢీకొడుతున్నాయి. గ్యారేజీలుగా మారడం వల్ల లారీ డ్రైవర్లు, క్లీనర్లు రోడ్ల మీదే స్నానపానాలు.. వంటా వార్పు వంటి దైనందిన కార్యకలాపాలు చేసుకుంటుండడంతో ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే భారీ వాహనాల సిబ్బంది రోడ్ల మీదే సేదదీరుతున్నారు. డివైడర్లపై కునుకు తీస్తుండడంతో మరింత ఇబ్బందిగా తయారైంది. నిత్యం ఇదే వరస కొనసాగుతుండడంతో స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. అగనంపూడి సాయిబాబా గుడివద్ద కూడా ఇదే పరిస్థితి ఉండడంతో పరిసర కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

భారీ వాహనాలను నిరోధించాలి..

బస్‌బేల వద్ద భారీ వాహనాలను నిరోధించాలి. బస్‌బేలు కేవలం బస్సులు నిలుపుదల చేయడానికి. కాని ఇ.మర్రిపాలెం, అగనంపూడి బస్‌బేలు మెకానిక్ షెడ్లుగా మారిపోయాయి. జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ, పోలీస్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

–గుడే గజేంద్రరావు, పెదమడక

ఇబ్బందిగా ఉంది

జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాలను రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా చుట్టుపక్కల ఉంటున్న వారికి సమస్యగా మారుతోంది.

–కొయ్య రాంబాబు, పినమడక

జోరుగా 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ చందు తదితరులు

గాజువాక: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని 70వ వార్డు చిట్టినాయుడు కాలనీలో కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆదివారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గృహ యజమానుల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా మరో అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారితో టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపీ, మోహన్, శ్రీను, కుమార్, మహేష్, దినేష్ పాల్గొన్నారు.



పెదమడకలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ కన్వీనర్లు, నాయకులు

ప్రజల స్పందన అద్భుతం

అగనంపూడి: మా భవిష్యత్తుకు భరోసా జగనన్నే అని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని ప్రజలు బహిరంగంగా చెబుతుండడం సంతోషంగా ఉందని గాజువాక క్లస్టర్ జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ అన్నారు. ఇందిరాకాలనీ, అండమాన్‌కొండయ్య వలస ప్రాంతాల్లో వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు గెద్దాడ సత్యవతి, అప్పలరాజు, కొలిపాక అప్పారావు, కరణం సంతోష్, గెద్దాడ రత్నం తదితరులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

పెదగంట్యాడ: సంపూర్ణ ఆరోగ్యానికి నిరంతర వ్యాయామం అవసరమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఐపీఏ, ఎన్‌పీసీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా లెవల్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్‌లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ పోటీల్లో సౌతిండియా రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎన్‌పీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మణికంఠ, ఢిల్లీ, గరికిన పైడిరాజు, పేర్ల అప్పారావు, రంజిత్, శంకరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉక్కు సంకల్ప మహా పాదయాత్ర విజయవంతం'



సమావేశంలో మాట్లాడుతున్న కురందాస్ వంశీకృష్ణ

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉక్కు సంకల్ప మహా పాదయాత్ర విజయవంతమైందని ఐఎన్‌టీయూసీ నాయకుడు కురందాస్ వంశీకృష్ణ అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలోని కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదగంట్యాడ నుంచి సింహాచలం దేవస్థానం తొలి పావంచా వరకూ నిర్వహించిన ఈ యాత్రలో ఉక్కు నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారని చెప్పారు. ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఉక్కు పరిరక్షణ కోసం భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు ముసిరి శ్రీనివాస్, నమ్మి అప్పారావు, నమ్మి అప్పలనాయుడు, నక్క వెంకటరమణ, నమ్మి దేముడు, నంబారు కనకరాజు, సంబారు అప్పలనాయుడు, చట్టి సింహాచలం, మొల్లి సింహాద్రి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



గుడివాడ అప్పన్నకాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్, నాయకులు ఈటి శ్యామలరావు, శిష్టు గోపాలరావు, కోడ రాజారావు, తెన్నేటి కృష్ణారావు, కోటేశ్వరరావు, నీలకంఠం, సుధాకర్, బి.సరస్వతి, సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టండి



అక్కిరెడ్డిపాలెంలో ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం, సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. 69వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం రాత్రి ఇరు పార్టీల నాయకులు ప్రచారభేరి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రకాల వస్తువుల ధరలను పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్మిక రంగాన్ని అథోగతిపాలు చేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎ.లోకేష్, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు, దాసరి అప్పారావు, డి.రమణమ్మ, నానాజీ, కె.అప్పారావు, గుడివాడ గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం, ప్లే ఫిట్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కృష్ణా కళాశాల సమీపాన గల ప్లే ఫిట్ అకాడమీలో నిర్వహించిన పోటీలు ఆదివా రం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో అసో సియేషన్ కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ పాల్గొ ని గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్లే ఫిట్ అకాడమీ కోచ్‌లు మురళీమోహన్ పాత్రో, గోపాల్, పవన్, జిల్లా సంఘం సభ్యులు వీఎస్ఎన్ మూర్తి, వి. ధనరాజ్, శ్రీకాంతరాజు, రవికుమార్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'దాతల సాయం మరువలేనిది'



వార్షికోత్సవంలో పాల్గొన్న స్వామి అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు, పాఠశాల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ అయ్యప్ప దేవాలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశబరి విద్యానికేతన్ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ ఎస్.ఎ.నాయుడు మాట్లాడుతూ స్వామి అయ్యప్ప దేవాలయానికి, శబరి విద్యానికేతన్ స్కూల్‌కు పలువురు దాతలు అందించిన సాయం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు చరపాక నాగార్జునరాజు, ప్రతినిధులు శీలంశెట్టి విశ్వేశ్వరరావు, ఎ.అప్పారావు, వీరారావు, నంబారు రాజు, పాఠశాల హెచ్ఎం సాధన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి



బీసీ సంఘ కొత్త నాయకులను సత్కరిస్తున్న నమ్మి అప్పలరాజు, భానుమూర్తి

గోపాలపట్నం: బీసీల సంక్షేమానికి కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నమ్మి అప్పలరాజు యాదవ్ కోరారు. ఎన్ఏడీ జంక్షన్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నమ్మి అప్పలరాజు, అనకాపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో నియమితులైనా వారిని ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిల్లాడ అప్పలరాజు, మాడుగుల నియోజకవర్గ అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోన నాగేశ్వరరావులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. 139 బీసీ కులాలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల జనగణన చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, దీన్ని ఉద్యమంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గోకివాడ నాయుడు, లొడగల రమేష్, చల్లా నానాజి తదితరులు పాల్గొన్నారు.

సేవితాకు జాతీయ బాలచిత్ర కళా అవార్డు



అవార్డు గ్రహీత సేవితాను అభినందిస్తున్న దీపాల్ ప్రిన్సిపాల్ జాకబ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ విద్యార్థిని ఆర్.సేవితాకు జాతీయ స్థాయి బాలచిత్ర కళా అవార్డు లభించింది. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1 ఉద్యోగి ఆర్.తిరుపతి రావు నాయక్, ఏపీ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ కల్పనల కుమార్తె సేవితా దీపాల్ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతోంది. ఇటీవల విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సేవి అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి కళా అవార్డును గెలుపొందింది. ఈ సందర్భంగా జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు, క్యూఎస్‌టీడీ సీనియర్ మేనేజర్ లాలూ భూక్యా, పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ జాకబ్ అవార్డు గ్రహీత సేవితాను, ఆమెకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ డి.దానయ్యను అభినందించారు.

ప్రైవేటీకరిస్తే కార్మికవర్గం సహించదు



794వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రైవేటీకరణ చేస్తే కార్మిక వర్గం సహించదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష 794వ రోజుకు చేరుకుంది. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు ఈ దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తిని పునరుద్ధరించాలని, బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని నాయకులు కోరారు. వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని, విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు ఈ నెల 25వ తేదీన సీఎండీ, డైరెక్టర్ల బంగ్లాలను, ఇళ్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



సోఫా వర్క్స్ షాపులో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: తోకాడలోని ఒక ఖాళీ ప్రదేశంలో ఫైబర్ షీట్లు, ఐరన్ మెటీరియల్, మెషినరీ వంటివి డంప్ చేసి ఉంచారు. వేకువ జామునే వీటి నుంచి భారీగా మంటలు వ్యాపించి దట్టమైన పొగలు వెలువడడం మొదలయింది. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్టు పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం ఏఎఫ్‌వో సతీష్ తెలిపారు. వివరాలు సేకరించడానికి ఎవరు అందుబాటులో లేరన్నారు. కాగా ట్రేడింగ్ కంపెనీకి చెందిన నరేందర్‌రెడ్డి అనే వ్యాపారి తానుంటున్న ట్రేడింగ్ కంపెనీని ఖాళీ చేసి వేరే కంపెనీకి వెళ్లే క్రమంలో సామగ్రిని ఇండస్ట్రీ ముందు డంప్ చేసినట్లు తెలిపారు. వీటికి ఎవరో నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సమాచారాన్ని డీఎఫ్‌వోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అగ్నికి ఆహుతైన సామగ్రి విలువ సుమారు రూ. 4 లక్షల వరకు ఉంటుందని యజమాని అంటున్నారు.

సోఫా వర్క్స్ షాపులో..

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి స్టీల్ సిటీ డిపో వద్ద చాయిస్ సీట్ కవర్ అండ్ సోఫా వర్క్స్ షాపులో ఆదివారం వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు పడడంతో అగ్నికీలలు వ్యాపించి షాపు అగ్నికి ఆహుతైంది. దీంతో స్థానికులు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు వెంటనే సమాచారాన్ని అగ్రిమాపక సిబ్బందికి తెలియజేయగా, హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్రిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే షాపులో సామగ్రి పూర్తిగా దగ్ధం అయింది. నష్టం ఎంతన్నది అగ్నిమాపక శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది.

ప్రచార భేరీ విజయవంతానికి పిలుపు



ఉక్కునగరంలో ప్రచార భేరీలో పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30 వరకు తలపెట్టిన ప్రచార భేరీని విజయవంతం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. ఆదివారం ఉక్కునగరం రైతుబజార్‌లో ప్రచారం నిర్వహించారు. అనంతరం సెక్టార్-11 వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక ఆటంకాలను సృష్టిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. పోర్టులు, రైల్వే, రక్షణ రంగం, హెచ్‌పీసీఎల్, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, ఎన్టీపీసీ, బ్యాంకులు, తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించకుండా ప్రజల నుంచి అధిక పన్నులు వసూలు చేస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చాలని చేస్తున్న చర్యలకు వ్యతిరేంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసరాజు, చిరంజీవి, పుల్లారావు, సుబ్రహ్మణ్యం, గౌరీశంకర్ పాల్గొన్నారు.

రహదారి పునరుద్ధరణ కోరుతూ ఆందోళన



రహదారి పునరుద్ధరణకు ఆందోళన చేస్తున్న నాతయ్యపాలెం ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెం బంగారుమాంబ ఆలయం, సాయిబాబా గుడి, ఎలిమెంటరీ స్కూల్ వైపు నుంచి ఎన్‌హెచ్ 5, కిమ్స్ ఐకాన్ వైపు వెళ్లే రోడ్డు వైపు రహదారిని పునరుద్ధరించాలని కోరుతూ నాతయ్యపాలెం గ్రామ ప్రజలు, పెద్దలు ఆందోళన నిర్వహించారు. షీలానగర్ డిజిటల్ ఆయాన్ పరీక్షా కేంద్రం పక్కన తుంగ్లాం సర్వే నంబర్ 112లో ఆదివారం చేపట్టిన ఆందోళనలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు గంట్రెడ్డి రామునాయుడు మాట్లాడుతూ సర్వే నంబర్ 112లో వాగు నుంచి హైవేకు రస్తా ఉండేదన్నారు. ఈ రస్తా నుంచి బళ్లు వెళ్లే మార్గం ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ సర్వే నంబర్‌లో ఉన్న రస్తా స్థలంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. గ్రామస్థులు సమష్టిగా రస్తా పునరుద్ధరణకు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ 69వ వార్డు అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు మాట్లాడుతూ సుమారు 10 వేలకు పైగా ఉన్న జనాభా, 600లకు పైగా గడపలు ఉన్న నాతయ్యపాలెం గ్రామానికి కనీసం అవుట్ లెట్ లేదన్నారు. ఇప్పటికే అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.30 లక్షలు మంజూరైనా సంబంధిత కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా పనులు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికై నా గ్రామ పెద్దలు, నాయకులు పార్టీలకు అతీతంగా రహదారి పునరుద్ధరణకు ప్రజా ప్రతినిధుల వద్దకు, అధికారుల వద్దకు వెళ్లి పనులు జరిగేలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంద్రాన సన్యాసిరావు, సంద్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకట్రావు, గోపిశెట్టి రామకృష్ణ, పల్లెల శ్రీనివాసరావు, ఆకుల ఉపమాక, గోపిశెట్టి నూకరాజు, ఆకుల అప్పారావు, టీఎల్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థాన నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దేవస్థానం అధికారులకు చెక్ అందిస్తున్న సత్యాల మహేష్, అప్పారావు దంపతులు

మల్కాపురం: మల్కాపురం నగరాల వీధికి చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సత్యాల మహేష్, ఎం.అప్పారావు దంపతులు సింహాచలం దేవస్థాన నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,116 విరాళంగా అందించారు. సంబంధిత చెక్‌ను ఆదివారం దేవస్థానం అధికారులకు అందజేశారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు నిత్యం అన్నదానం చేస్తున్నారని, తమ వంతు కానుకగా ఈ చిన్న మొత్తాన్ని ఇచ్చామని దాతలు తెలిపారు.